నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 ఆదివారం 12 మే 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

# ఆశీర్వదిస్తే సమస్యలపై పోరాడుతా

**అవసరం కోసం పార్టీలు మారే గడ్డం ఫ్యామిలీకి బుద్ధి చెప్పండి**

**బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్**

కోటపల్లి, మే 11 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా మారిందని, లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం చెన్నూర్ పట్టణంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. మోస పూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేక చేతులెత్తేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం మారితే పాలన మెరుగుపడాలి గాని.. మరుగున పడిపోతున్నదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిడికిలి బిగించి ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని, పార్లమెంట్ ఎన్నికలే ఇందుకు పునాది కావాలన్నారు. సింగరేణి కార్మికుడిగా సాధారణ జీవితం ప్రారంభించిన తనకు ఈ ప్రాంతంపై గట్టి పట్టుందని, ప్రజలు ఎంపీగా ఆశీర్వదిస్తే సింగరేణి కార్మికులు, ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడుతానని తెలిపారు. ఆస్తుల రక్షణ కోసం వచ్చే నాయకులను నమ్మొద్దని, అవసరం కోసం పార్టీలు మారే గడ్డం ఫ్యామిలీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

# కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకుందాం

- మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- గడ్డం వివేక్ కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా కుట్ర చేస్తున్నడు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

చెన్నూర్, మే 11 : పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ లోకల్ నాయకుడని, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రజా సేవ చేశారని, సింగరేణి కార్మికుడిగా 25 ఏళ్ల పాటు సేవలందించారని, తెలంగాణ కోసం ఉద్యమం చేశారని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. శనివారం చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. మోస పూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని, గడిచిన ఐదు నెలల్లో అభివృద్ధి అటకెక్కిందని, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని మండిపడ్డారు. ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్ తనపై ఉన్న కోపంతో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసే కుట్ర చేస్తున్నడని, అప్పట్లో తాము మంజూరు చేయించిన అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నడని మండిపడ్డారు. పెద్దపల్లి నియోజకవర్గంలో గడ్డం ఫ్యామిలీ ఏ ఒక్క దళిత నాయకుడినీ ఎదగనీయడం లేదన్నారు. ఈ ఏరియాలో ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా వారి కుటుంబ సభ్యులే ఉండాలనే ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఇదంతా ప్రజలు గమనించాలని కోరారు. గడ్డం వివేక్ 2018లో బీఆర్ఎస్‌లో ఉండేనని.. ధర్మపురిలో కొప్పుల ఈశ్వర్‌ను ఓడించే కుట్ర చేశాడని, అందుకే ఆనాడు ఎంపీ టికెట్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు వడ్లను కొనకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, వర్షాలకు ధాన్యం తడిసిపోయినా పట్టించుకోవడం లేదన్నారు. తమలాంటి దళిత బిడ్డలకు ప్రజలే దిక్కు అని, తమకు మద్దతిస్తే వారికి సేవ చేసుకుంటామన్నారు. కోట్లు వెనకేసుకున్నోళ్లం కాదని, నమ్మిన ప్రజల కోసం చివరి శ్వాస వరకూ పనిచేసేటోళ్లమని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు వేధిస్తున్నారని, కేసులు పెడుతున్నారని, మొన్న రైతు దీక్ష చేస్తామంటే ఇక్కడి సీఐ టెంట్‌ను తొలగించారని, ఈ సీఐ ఖాకీ బట్టలు తీసేసి, కాంగ్రెస్ బట్టలు వేసుకొని కండువా కప్పుకుంటే అయిపోతదన్నారు. బహిరంగ సభకు వస్తున్న బస్సులను అడ్డుకున్నారని, ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. తెలంగాణలో ఏ రోజున కేసీఆర్ టైమ్ వస్తుందో... ఆ రోజు తన టైమ్ కూడా వచ్చినట్లేనని, ఆ రోజు విడిచి పెట్టేది లేదని ఆయన హెచ్చరించారు.



ప్రజా ఆశీర్వాద సభకు తరలివచ్చి బీఆర్ఎస్‌కు జై కొడుతున్న ప్రజలు, నాయకులు, కార్యకర్తలు

# జోష్ నింపిన కేటీఆర్ టూర్


**చెన్నూర్ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో శ్రేణుల్లో ఫుల్ ఖుషీ**

చెన్నూర్/కోటపల్లి, మే 11 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం చెన్నూర్ పట్టణంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ కాగా, శ్రేణుల్లో జోష్ కనిపిస్తున్నది. కేటీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా 12.10 గంటలకు చెన్నూర్‌లోని మీని స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకొని పూలమాల వేశారు. అనంతరం 12.33 గంటలకు సభాస్థలికి చేరుకున్నారు. 1.09 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి, 1.31 గంటలకు ముగించారు. ఆపై దళిత సోదరుడు, బీఆర్ఎస్ కార్యకర్త ఎనగందుల ప్రశాంత్ ఇంటికెళ్లి మధ్యాహ్నం భోజనం చేశారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో తిరుగు పయనమయ్యారు.

**ఎండను సైతం లెక్క చేయక..**

ఎండ తీవ్రతను సైతం లెక్క చేయకుండా నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు, సింగరేణి కార్మికులు తరలివచ్చారు. సభలో కేటీఆర్ మాట్లాడుతున్నప్పుడు ప్రజలు ఈలలు, చప్పట్లతో మారుమోగించారు. ఆయన ప్రసంగం ఆకట్టుకున్నది. కేసీఆర్ ఉన్నప్పుడే ప్రభుత్వం బాగుండే అనే వారు చేతులు లేపండి అంటే.. సభలో ఉన్న వారంతా చేతులు లేపారు. కేటీఆర్‌కు స్వాగతం పలుకుతూ బీఆర్ఎస్ నాయకులు భారీ ఫ్లెక్సీలు, కౌటౌట్లు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

> ఇవాళ గ్రామ గ్రామానా.. రైతు బంధు పడలేదని రైతులు తిట్టుకుంటున్నరు. ఎవ్వడన్న నాట్లు వేసేప్పడే రైతుబంధు వేస్తడు కానీ రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్లు వేసేటప్పడు వేస్తున్నడు. నాట్లప్పడు కాదంట.. ఓట్లప్పడే యాదికి వస్తదంట. ఇజ్జతి కూడా లేదు. నాట్లప్పడు వేస్తే పైసలు పనికివస్తయ్. కానీ ఇవాళ పురుగుల మందు కొనుక్కునే పరిస్థితి వచ్చింది రైతులకు. పంట నష్టపాయే.. ఆగమాగమయిపాయే. తెలంగాణలో మళ్లా ఆత్మహత్యలు మొదలైనయ్. అందుకే దయచేసి చెప్తున్నా.. మంచిగ ఉన్నప్పడు మనషుల విలువ తెల్వదు. అప్పడప్పడు గాడిదలను చూస్తనే గుర్రాల విలువ తెలుస్తది. అప్పడప్పడు చీకట్లను చూస్తనే.. వెలుగు విలువ తెలుస్తది. అందుకే చెప్తున్నా.. దయచేసి ఆగం కాకండి.. - కేటీఆర్



చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**భూగర్భ కార్మికుడు కావాలా.. ఆగర్భ శ్రీమంతుడు కావాలా..**

# ఈశ్వరుడికి.. కోటేశ్వరుడికి పోటీ

**పెద్దపల్లి ఎంపీగా ఈశ్వర్ అన్న గెలిస్తే మంచిగ పనిచేస్తరు**

- రేవంత్ ముసలోళ్ల పింఛన్ ఎగ్గొట్టి.. వాళ్ల కడుపుకొట్టిండు
- మోసం చేసినోళ్లకు ఓటుతో బుద్ధి చెప్పండి
- లక్ష ఎకరాలకు నీళ్లిచ్చే లిఫ్ట్ ఇరిగేషన్ ఆపడం కాదు.. దమ్ముంటే రెండు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే పథకం తీసుకరండి
- చేతి గుర్తోడు గెలిచినా.. పువ్వు గుర్తోడు గెలిచినా సింగరేణిని అమ్మడం ఖాయం
- మంచి పనులు చేసి జనాల మనసు గెలవాలే
- చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్‌కు జై కొడుతున్న ప్రజలు, నాయకులు, కార్యకర్తలు

మంచిర్యాల, మే 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'పెద్దపల్లి పార్లమెంట్‌లో పోటీ ఎవరెవరి మధ్య జరుగుతుందంటే.. మొన్ననే పెద్దలు కేసీఆర్ మంచిర్యాలకు వచ్చినప్పుడు చెప్పారు. భూగర్భగని కార్మికుడికి.. ఆగర్భ శ్రీమంతుడికి మధ్య పోటీ నడుస్తున్నది. ఈశ్వరునికి.. కోటీశ్వరునికి మధ్య పోటీ జరుగుతున్నది. ఒక గుణవంతుడికి.. ఒక ధనవంతుడికి మధ్య పోటీ జరుగుతున్నది. మరి గెలిచేదెవ్వరు.. గెలవాల్సింది ఎవ్వరో.. మీరే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. దయచేసి ఆగం కావొద్దు. ఇదే చెన్నూర్ పట్టణానికి సరిగ్గా ఐదు నెలల కింద నవంబర్ 24న తమ్ముడు బాల్క సుమన్‌ను గెలిపించండి అని అడగడానికి వచ్చాను. కానీ ఏమైందో.. ఏమో నాలుగైదు రోజుల్లోనే పరిస్థితి తారుమారైంది. కాంగ్రెసోళ్లు చూపెట్టిన అరచేతిలో వైకుంఠం.. అనే సినిమా చూసి చెన్నూర్ ప్రజలు మోసపోయారు.' అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం చెన్నూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

**ఈ ఐదు నెలల్లో ఏమన్నా జరిగిందా...**

ఏమన్నరు కాంగ్రెసోళ్లు.. ఫ్రీ బస్సు అన్నరు.. తులం బంగారం ఇస్తా.. ఆడపిల్లలకు స్కూటీలు.. కోడళ్లకు రూ.2500, అత్తలుంటే(ముసలవ్వలకు) రూ.4000, అత్తలకు భర్తలుంటే(ముసలయ్యలకు) రూ.4000 పింఛన్ ఇస్తా అన్నరు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ అన్నరు. క్వింటాలు వరికి రూ.500 బోనస్ ఇస్తా అన్నరు. ఈ ఐదు నెలల్లో వీటిలో ఏదైనా అమలయ్యిందా చెప్పాలంటూ జనాలను కేటీఆర్ ప్రశ్నించారు. ఫ్రీ బస్సులో ఏమన్నా సుఖం ఉన్నదా.. ఫ్రీ బస్సు తుస్సు మందన్నారు. రేవంత్‌రెడ్డి రూ. రెండు లక్షల రుణ మాఫీ అన్నడు. డిసెంబర్ 9 నాడు ఎంబడే చేస్తా. ఉరుకుండ్రి బ్యాంక్ నుంచి తెచ్చుకోండి.. నేను సంతకం పెట్టనే పెడితిని.. మీ ఖాతాలో పడనే పడే.. అన్నడు. మరి పడ్డయా పైసలు.. పడ్డయా రెండు లక్షలు.. రైతన్నలు, రైతు బిడ్డలు ఆలోచించాలన్నారు. మరి చెన్నూర్‌లో ఉన్న కోటీశ్వరుడన్న ఇయ్యలేదా రెండు లక్షలు. ఆయన జేబు దులిపితే పడుతయ్ రెండు లక్షలు.. కానీ వేస్తలేరన్నారు. అయినా మళ్లా వాళ్లకే ఓటు వేద్దామా.. మళ్లా మొండి చేయికే గుద్దుదామా.. మనకు మొండిచేయి ఇచ్చినంక కూడా తెలివి తెచ్చుకోవద్దా.. ఆలోచించి నిర్ణయం తీసుకోవలన్నారు. ముసలోళ్లకు రూ. నాలుగువేల పింఛన్ ఇస్తా అన్నరు. కేసీఆర్ ఒక్కరికే ఇస్తండు.. నేను ఇద్దరికీ.. ముసలమ్మ–ముసలయ్యకు ఇస్తా.. కేసీఆర్ రెండు ఇస్తే నేను నాలుగు ఇస్తా అన్నడు.. మరి పడ్డయా పింఛన్లు అంటే.. కొత్త పింఛన్లు ఇచ్చుడు కాదు జనవరి నెల ముసలోళ్ల పింఛన్లు ఎగ్గొట్టి.. వాళ్ల కడుపుకొట్టినోడు రేవంత్‌రెడ్డి అంటూ ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చినంక తెలంగాణలో లక్షన్నర పెళ్లిళ్లు అయ్యాయని, ఈ లెక్కన రేవంత్‌రెడ్డి లక్షన్నర తులాల బంగారం మా ఆడబిడ్డలందరికీ బాకీ ఉన్నాడు. నిన్ను నమ్మి ఓట్లు వేసిండ్రు.. మీరు చెప్పిన అడ్డగోలు హామీలు నమ్మి ఓట్లు వేసినోళ్లందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**పదిపన్నేండు సీట్లు ఇవ్వండి..**

ఇక్కడికి వచ్చినోళ్లందరూ నిజాయితీగా సమాధానం చెప్పండి. ఐదు నెలల కిందట కేసీఆర్ ప్రభుత్వం ఉండే.. అప్పుడే బాగుండే అనుకున్నోళ్లందరూ చేతులు ఎత్తాలంటూ కేటీఆర్ అడగ్గానే.. వచ్చిన జనం మొత్తం చేతులు ఎత్తారు. బరాబరా ఈ ముచ్చట.. పక్కానా.. ఏం అనుమానం లేదా.. అని ప్రశ్నించగా.. పక్కాగా చెప్తున్నామన్నారు. అయితే మీరంతా చేయాల్సింది ఒక్కటే పని.. 13న జరిగే ఎన్నికల్లో రెండో నంబర్ మీద ఓటేయాలని పిలుపునిచ్చారు. మొత్తం తెలంగాణలో పది పన్నెండు సీట్లు ఇయ్యండి. ఆరు నెలల్లో తిరిగి కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసించే పరిస్థితి వస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో బుల్లెట్ కంటే బ్యాలెట్‌కే ఎక్కువ పవర్ ఉంటుందన్నారు. ఇవాళ పోలీసోళ్ల దగ్గర బులెట్లు ఉండొచ్చు. కానీ, మీ దగ్గర బులెట్ కంటే పదునైన ఆయుధం బ్యాలెట్ ఉందన్నారు. పెద్దపెద్ద కోటీశ్వరులను కూడా కొట్టేందుకు ఒక్కటే ఆయుధం ఓటు అని.. ఆ ఓటుతోని వేటు వేయాలంటూ పిలుపునిచ్చారు. ఎవ్వరైతే మిమ్ములను మోసం చేసిండ్రో.. ఎవ్వలైతే అడ్డగోలు కార్యక్రమాలు చేస్తున్నరో వాళ్లకు బుద్ధి చెప్పాలని కేటీఆర్ సూచించారు.

**ప్రజల మనసు గెలవాలంటే.. దమ్ముతో పనులు చేయాలే..**

ఇందకా నేను ఇక్కడికి వస్తుంటే సుమన్ చెప్తున్నడు.. అన్న నా మీద కోపంతో నేను మంజూరు చేయించిన లక్ష ఎకరాలకు నీళ్లిచ్చే చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును క్యాన్సల్ చేయించిండు అని బాల్క సుమన్ చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. దీనికి నేను ఏమంటున్న అంటే.. నువ్వు(వివేక్) గెలిచినవ్ సరే.. గెలిచినంక ప్రజల మనసు గెలవాలి కదా.. గెలవాలంటే ఏం చేయాలే.. తమ్ముడు లక్ష ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్ట్ తీసుకువస్తే నీకు చేతనైతే, నీకు దమ్ముంటే దాన్ని పెంచు. రెండు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రయత్నం చేయాలన్నారు. రెండు పంటలకు నీళ్లిచ్చే ప్రాజెక్ట్ ఉంటే.. మూడు పంటలకు నీళ్లిచ్చేలా చేయమని సూచించారు. చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీలకు నేను మున్సిపల్ మంత్రిగా పైసలు ఇచ్చినా.. నీకు దమ్ముంటే నేను రూ.50 కోట్లు ఇస్తే.. నువ్వు రూ.150 కోట్లు తీసుకురా.. ప్రజల మనసు గెలుచుకుంటే గట్ల గెలుచుకోవాలే.. రాజకీయం అంటే అదే కోరుకుంటరు ప్రజలు. రూపాయి ఎక్కువ పని చేయాలే.. అందుబాటులో ఉండాలే.. కష్ట.. సుఖాల్లో తోడుండాలే అనుకుంటున్నరు. కానీ ఇవాళ గెలిచినోళ్లకు ఆ సోయి లేదంటూ మండిపడ్డారు.

**బీజేపీకి ఎందుకు ఓటేయాలే..**

ఎందుకు వేయాలే బీజేపీ వాళ్లకు ఓటు అంటే గుడి కట్టినం అని చెప్తున్నారు.. మరి కేసీఆర్ కట్టలేదా గుడి.. యాదాద్రిలో బ్రహ్మాండమైన గుడి కట్టలేదా చెప్పాలని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఒక్క యాదగిరి గుట్టనే కాదు బ్రహ్మాండంగా నీళ్లు తీసుకువచ్చేందుకు చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేసిండు. కాళేశ్వరంలాంటి ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డిలాంటి ప్రాజెక్టు కట్టిండు.. ఎర్రటి ఎండల్లో చెరువులను మత్తడి దునికిచ్చిండు. గసొంటి కేసీఆర్‌ను పోగొట్టుకొని.. పదేళ్లలో బుడ్డ పైసా పని చేయని మోదీకి ఎందుకు ఓటు వేయాలో ఆలోచించాలన్నారు. అన్నీ పిరం చేసినోడే మోదీ అని.. పప్పు, ఉప్పు, నూనె, సామాన్యుడు తినే కూరగాయలన్నీ పిరమైనయంటే దానికి కారణం ఒకే ఒక్కడు మోదీ అన్నారు. కాంగ్రెస్ చేతి గుర్తోడు గెలిచినా.. బీజేపీ పువ్వు గుర్తోడు గెలిచినా.. సింగరేణిని అదానీకి అమ్మేయడం ఖాయమన్నారు. సింగరేణి ప్రవేట్ పరం కావద్దు అంటే ఈశ్వర్ గెలవాలన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అనుకునే వాళ్లంతా ఈశ్వర్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పాల్గొన్నారు.

**మా తమ్ముడు దమ్ము.. రేషం ఉన్నోడు**

> మా తమ్ముడు సుమన్ రేషం ఉన్నోడు. దమ్ము ఉన్నోడు. నేను ఉత్తగనే అనలే ఈ మాట. రేవంత్‌రెడ్డి అనేటోడు చిల్లర గాడు. ముఖ్యమంత్రే కావచ్చు కానీ చిల్లర గాడు. గా చిల్లరగాడు కేసీఆర్‌నుద్దేశించి ఒక చిల్లర మాట మాట్లాడిండు. నేను కేసీఆర్ కొడుకునే కావచ్చు. కానీ నా తమ్ముడు ఎంత రేషం ఉన్నోడంటే చెప్పు తీసి ముఖ్యమంత్రికి చూపెట్టిండు. చెప్పుతో కొడుతా చెత్తనా కొడుకా అని చెప్పిండు. అదీ దమ్మున్న నాయకుడు అంటే. పదవి ఉంటది కావచ్చు. పీకుతది కావచ్చు. బతికేదే కొన్ని రోజులు. అందరం చస్తాం. కానీ బతికినన్ని రోజులు రేషంతోని బతకాలి అని చూపెట్టిన పులి బిడ్డ మా తమ్ముడు సుమన్. ఆయనకు హృదయ పూర్వకంగా ధన్యవాదాలు. ఇంత మంచి నాయకుడిని కోల్పోయారు. మరి ఇప్పుడు ఈశ్వర్ అన్నను గెలిపిస్తే రేపు చెన్నూర్ ఎమ్మెల్యే లెక్క చేస్తడు - కేటీఆర్



చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో నృత్యం చేస్తున్న చిన్నారులు, మహిళలు



పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో బాల్క సుమన్



చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభ అనంతరం బీఆర్ఎస్ కార్యకర్త, దళిత సోదరుడు ఎనగందుల ప్రశాంత్ ఇంట్లో భోజనం చేస్తున్న కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్

